క్లుప్తంగా

సింగరేణి డైరెక్టర్(పా)ను కలిసిన కమిషనర్



గౌతంపాత్రుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంశీధర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్(పా) గౌతంపాత్రును ఇటీవల నూతనంగా నియామకమైన సీఎంపీఎఫ్ రీజియన్ కమిషనర్ వంశీధర్ కుసుంభ గురువారం ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



నర్సింహసాగర్ వద్ద అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

సుజాతనగర్: వర్షాల కారణంగా ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్ తెలిపారు. వర్షాల ప్రభావంతే లక్ష్మీదేవిపల్లి, నర్సింహసాగర్, సింగభూపాలెం గ్రామాల్లోని వంతెనలు, చెప్టాలను గురువారం ఆయన పరిశీలించారు. గతంలో పడిన ఇబ్బందులను ఆయా గ్రామాల్లోని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్ఐలు కాంతారావు, వీరభద్రం పాల్గొన్నారు.

చెడుకు దూరంగా ఉండాలి

పాల్వంచరూరల్: విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బ్రహ్మకుమారి రాజయోగ కోరారు. బస్వతారక కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సెల్‌ఫోన్ అధికంగా వినియోగం, మాదకద్రవ్యాల వినియోగం పట్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. విద్యార్థులు అవసరమైతే తప్ప సెల్‌ఫోన్ వాడొద్దన్నారు. రేడియేషన్ ప్రభావంతో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు అయితే భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. చెడు మార్గాల వైపు వెళ్లకుండా ధ్యానం చేయడం ద్వారా మనస్సును నియంత్రణలో ఉంచుకోవచ్చని చెప్పారు.

ప్రమాదకరంగా కల్వర్టు



కల్వర్టుపై ఏర్పడిన రంధ్రంలో గడ్డిని అమర్చుతున్న మిట్టపల్లి గ్రామస్తులు

ఇల్లెందురూరల్: మిట్టపల్లి గ్రామ సమీపంలో ఇల్లెందు – బయ్యారం మండలాలను కలిపే ప్రధాన రహదారిపై కల్వర్టు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారింది. గతంలో కల్వర్టుకు ఒకవైపు కుంగి రంధ్రం ఏర్పడటంతో గ్రామస్తులు పూడ్చారు. మళ్లీ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రస్తుతం మరోవైపు కుంగింది. గ్రామస్తులు కల్వర్టుపై రంధ్రాలు ఏర్పడినట్లుగా సూచించేలా గడ్డిని ఎత్తుగా అమర్చారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి కల్వర్టుకు మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా సాధికారత అంతంతే..

- సౌకర్యాలు కోరుతున్న సింగరేణి ఉద్యోగినులు
- గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద వసతుల కల్పనపైనా వినతి



సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మహిళా సాధికారతకు గౌరవప్రదమైన ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళా ఉద్యోగుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని మహిళా కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. గతంలో సింగరేణి వ్యాప్తంగా 200 మంది మహిళలే పనిచేసేవారు. అదీ కార్పొరేట్ కార్యాలయంలో ఎక్కువగా ఉండేవారు. కానీ వారసత్వ ఉద్యోగాల కల్పన మొదలయ్యాక అందులోనూ మహిళలకు అవకాశం కల్పించటంతో ఈ ఏడాది మార్చి 31 నాటికి 2,007 మహిళలు పనిచేస్తున్నట్టు సంస్థ రికార్డులు చెబుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా మహిళా సాధికారతను వాస్తవికంగా ప్రోత్సహించాలంటే మహిళా ఉద్యోగుల భద్రత, సౌకర్యాలు, గౌరవంతో కూడిన పని వాతావరణం కల్పించాల్సిన అవసరముందని పలువురు చెబుతున్నారు.

ప్రభుత్వ చట్టాలు ఇవీ...

కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగుల రక్షణకు చట్టాన్ని రూపొందించినా కొన్ని చోట్లే అమలవుతోంది. ఇందులో ప్రధానంగా మెటర్నిటీ బెనిఫిట్ చట్టం – 2017 ప్రకారం 50 మంది కంటే ఎక్కువ మహిళా ఉద్యోగులు ఉన్న ప్రతీ సంస్థలో క్రచ్‌రూమ్ (బట్టలు మార్చుకునే గది) కచ్చితంగా ఏర్పాటు చేయాలి. మహిళల భద్రతకు ప్రత్యేక మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి.. ఎవరైనా అధికారి, ఉద్యోగి మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తే ప్రత్యేక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఈ చట్టం ప్రకారమే సంస్కరణాత్మక అవగాహన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణ నిర్వహించాల్సి ఉంటుంది.

ఈ సౌకర్యాలు తప్పనిసరి..

మహిళా ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై యాజమాన్యం దృష్టి సారించాల్సి ఉంది. బొగ్గు గనులు, ఇతర విభాగాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల బట్టలు మార్చుకునే గదులు (క్రచ్ సదుపాయం), పిల్లల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అంతేకాక పరిశుభ్రమైన, సురక్షితమైన వాష్‌రూములు అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద అందుబాటులోకి తీసుకురావాలి. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక తాగునీటి సదుపాయం ప్రతీ విభాగంలో కల్పించాలి.

అలంకారప్రాయంగా ఫిర్యాదుల కమిటీ



సింగరేణిలో మహిళా ఉద్యోగుల లైంగిక వేధింపుల నివారణకు యాజమాన్యం ఏర్పాటు చేసిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ అలంకార ప్రాయంగానే మారింది. ఈ కమిటీ ఏర్పాటై మూడేళ్లు గడిచినా ఒక్క ఫిర్యాదు రాకపోవడమే ఇందుకు నిదర్శనం. ఈ కమిటీ ఉన్నట్లు తెలిస్తే ఉద్యోగినులకు భరోసా ఉంటుంది.

– మాధవనాయక్, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి

క్రచ్, కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



ఏ పరిశ్రమల్లోనైనా 50 మంది కంటే ఎక్కువ మహిళలు ఉంటే మెటర్నిటీ బెనిఫిట్ చట్టం – 2017 ప్రకారంగా క్రచ్, కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. సింగరేణిలో మహిళా ఉద్యోగులు ఎక్కువగానే ఉన్నందున యాజమాన్యం సదుపాయాలు కల్పించాలి. ఈ దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– పుష్పకుమారి, సీనియర్ స్టాఫ్ నర్స్, మెయిన్ ఆస్పత్రి

కార్మికులకు అన్యాయం జరిగింది..



సింగరేణి(కొత్తగూడెం): ధర్నా చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో, కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు పీతాంబరరావు మాట్లాడుతూ గత నెల 30, 31 తేదీలలో నిర్వహించిన హయ్యర్ రిఫరల్ మెడికల్ బోర్డులో తొమ్మిది నెలలుగా కార్మికులు ఎదురుచూస్తున్న తరుణంలో 52 మందికిగాను కేవలం ఐదుగురిని మాత్రమే అన్‌ఫిట్ చేయటం సరైంది కాదన్నారు. దీనివలన కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ బోర్డును రద్దు చేసి, తిరిగి బోర్డు నిర్వహించాలన్నారు.

ఇల్లెందు: సింగరేణి భూగర్భ గనుల్లో పనిచేసిన కార్మికులు గుండె, ఊపిరితిత్తుల, మూత్రపిండాల జబ్బులు, పక్షవాతం, కాళ్లవాపులు, బీపీ, షుగర్ లాంటి అనేక జబ్బులతో బాధపడుతున్నారని దీనివల్ల తరుచు విధులకు గైర్హాజరవుతున్నారని జీఎల్‌బీకేఎస్ తెలిపింది. ఈ మేరకు జీఎల్‌బీకేఎస్ నాయకులు కాపు కృష్ణ, కొప్పుల శ్రీనివాస్, బి.వరప్రసాద్ గురువారం జీఎం వి.కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. అనారోగ్యం పాలైన కార్మికులు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుంటే అన్‌ఫిట్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు.

ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు

పాల్వంచ: కృష్ణాష్టమి వేడుకలను గురువారం పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. శ్రీ విద్య లో విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

జూలూరుపాడు: స్థానిక సెయింట్ ఆంటోనియస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం ముందస్తుగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

టేకులపల్లి: గ్రావిటీ ప్రీమియర్ స్కూల్‌లో గురువారం ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు అలరించారు. ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి బ్రహ్మాచారి, కరస్పాండెంట్ బోడ పుణ్యానాయక్, ఉపాధ్యాయులు గంగ, సుధాకర్, భవాని, సునీత, లలిత, సరస్వతి, రేణుక, రజిత పాల్గొన్నారు.

నడిరోడ్డు మీద వ్యక్తిపై పలువురి దాడి



నరేష్‌పై దాడికి పాల్పడుతున్న యువకులు

పాల్వంచ: నడి రోడ్డుపై ఓ గ్యాంగ్ విచక్షణా రహితంగా ఓ వ్యక్తిపై దాడికి పాల్పడింది. అడ్డుకునేందుకు పోలీస్ సిబ్బంది ప్రయత్నించినా వారిని కూడా నెట్టివేసి మరీ కొట్టుకున్నారు. స్థానికుల కథనం మేరకు వివరాలు... బంధువుల అమ్మాయి వెంటపడొద్దని చెప్పిన విషయాన్ని మనసులో పెట్టుకుని గురువారం బీసీఎం రోడ్డులో నరేష్ అనే వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని అదుపు చేసేందుకు ప్రయత్నించినా వారిని కూడా లెక్కచేయలేదు. గంజాయి మత్తులో ఉండే ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. కాగా దాడి చేసిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడిలో నరేష్‌కు తల పగిలి గాయమైంది. అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నరేష్ వికలాంగుల కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ కాగా, అతడిపై దాడికి పాల్పడింది శ్రీనగర్ కాలనీ యర్రంశెట్టి ఉపేందర్, రాజేశ్వరి, మోరంపల్లి బంజరకు చెందిన ఎస్‌కే.అల్లాబక్షు, గాంధీనగర్‌కు చెందిన గంధం వర్షిత్, గంధం వరుణ్ తేజ్, నాగారానికి చెందిన పోసా కార్తీక్‌గా పోలీసులు గుర్తించారు. ఈ విషయమై ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరగా దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నామని, విచారిస్తున్నామని తెలిపారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డుల పంపిణీ



హెల్త్‌కార్డులు అందజేస్తున్న సత్యనారాయణ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో శుక్రవారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదులకు హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ న్యాయవాదుల వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని న్యాయవాదులకు హెల్త్‌కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటితో న్యాయవాలు, వారి కుటుంబ సభ్యులకు రెండేళ్ల వరకు రూ.2 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనపరెడ్డి గోపికృష్ణ, కనకం చిన్నికృష్ణ, ఆడపాల పార్వతి, ఎంఏ రజాక్, ఏపూరి బాబూరావు, పోసాని రాధాకృష్ణమూర్తి, జంగాల పద్మారావు, ఆడపాల మహాలక్ష్మి, రేపాక, మనోహర్, మల్లెల ఉషారాణి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పోస్టాఫీస్ సెంటర్‌లో గురువారం జిల్లా రవాణాశాఖ అధికారి ఇన్‌చార్జ్ వి.వెంకటరమణ, వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్‌లు, అనుమతి పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలను లేని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ విజయతో పాటు ఆర్టీఓ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రవిని అభినందిస్తున్న ఇల్లెందు నాయకులు

ఇల్లెందు: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేసేందుకు ఎస్టీఎఫ్ఐ కృషి చేస్తుందని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చావా పేర్కొన్నారు. గురువారం ఇల్లెందులోని మెయిన్‌రోడ్ హైస్కూల్‌లో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు దేశ వ్యాప్తంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఎస్టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా రవిని ఘనంగా అభినందించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రాంబాబు, కె.వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, రమేష్, కృష్ణ, శ్రీను, శేషగిరిరావు, కిరణ్, రఘు, సాంబశివరావు, కృష్ణకుమారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేతాజీ యువజన సంఘం వార్షికోత్సవం

పాల్వంచ: స్థానిక నేతాజీ యువజన సంఘం 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వనమా కాలనీలోని కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్ మాట్లాడుతూ... సమాజ సేవలో నేతాజీ యువజన సంఘం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో దేవీలాల్, భార్గవ్ సాయి, సయ్యద్ రషీద్, ఎండీ.మంజూర్, సయ్యద్ అక్బర్, రజాక్, రవూఫ్, సంతోష్, రమేష్, ఉబ్బన శ్రీను, ఓలపల్లి రాంబాబు, సక్కుబాయి, విజయ, ప్రవళిక, హరి, సాయిరాం, నాయుడు, బన్సింగ్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ బృందానికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. ఉపాధి హామీ పథకం 16వ సామాజిక తనిఖీలో భాగంగా తనిఖీ బృందం, ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శుల సమన్వయ సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. మాట్లాడుతూ.. తనిఖీ బృందం సభ్యులు వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసి తప్పొప్పులను నిర్ధారించాలని సూచించారు. పరిశీలనకు అవసరమైన అన్ని రికార్డులను క్షేత్ర పర్యటనకు ముందే అప్పగించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్, ఎస్ఆర్‌పీ సుశీల పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం బంద్ చేస్తాం..



ధర్నా చేస్తున్న మిడ్ డే మీల్స్ కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మిడ్ డే మీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రతీ విద్యార్థికి రూ.25 ఇవ్వాలని, గుడ్డుకు ధర పెంచాలని, పీఎఫ్, ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే అక్టోబర్ 1నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బంద్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం పీఈఓ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ప్రభావతి, మంగ, పద్మ, బుజ్జమ్మ, క్రాంతి, స్వప్న, రమాదేవి ఏఐటీయూసీ నాయకులు ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



చుంచుపల్లి: ర్యాలీలో బీజేపీ నాయకులు

చుంచుపల్లి: ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా చేపడుతున్న సందర్భంగా గురువారం బీజేపీ ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ వరకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు, విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాలు, ప్రతీ దేశభక్తుడు తమ ఇళ్లపైన జాతీయ పతాకం ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీకే మనోహర్‌రావు, జల్లారపు శ్రీనివాస్, పైడిపాటి రవీందర్, నోముల రమేష్, జీవీకే శివ, సలీం, మాలోత్ గాంధీ నాయక్, బలగం శ్రీధర్, గుంపుల మహేష్, బానోత్ రాంబాబు, గొడుగు శ్రీధర్, బడే రమేష్, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

టేకులపల్లి: 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తేజావత్ శంభునాయక్, టీచర్స్ సెల్ జిల్లా కన్వీనర్ వాంకుడోత్ హత్తీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి టేకులపల్లిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి బ్రహ్మాచారి, బోడ పూన్యానాయక్,, రవిరాథోడ్, డి.బాలాజీ, ద్రావ్‌సింగ్, ఇస్లావత్ రాములు నాయక్, బాల, ప్రసాద్, బాలకృష్ణ, గురుమూర్తి, పార్వతి, గంగా, నాగేందర్, సురేష్ నాయక్, రాందాస్ నాయక్, నవీన్, జమాల్, రాజు, జబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. అందని ద్రాక్ష

- పడావు పడిన ఈత కొలను
- పారిశుద్ధ్యం కరువు
- బోసిపోయిన లేక్ వ్యూ పార్క్



రెండు నెలల క్రితం కొలనులో సందడి చేస్తున్న చిన్నారులు (ఫైల్)



ఎండిపోయిన ఈత కొలను

ఇల్లెందు: పట్టణ ప్రజలకు వినోదం పంచే లేక్ వ్యూ పార్క్ బోసిపోయింది. సెలవుల్లో విద్యార్థులకు ఆహ్లాదం పంచే పార్క్, శరీరానికి ధృడత్వంతో పాటు ఈత నేర్పించే కొలనును ఎండగట్టారు. లేక్ వ్యూ పార్క్ పడావు పడింది. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పారిశుద్ధ్యం కరువయింది. ఆట వస్తులకు మెయింటెనెన్స్ లేదు. ఈ పార్క్‌లో రూ.కోటితో ఏర్పాటు చేసిన ఈత కొలను రెండు నెలలుగా పడావు పడేశారు. మెయింటెనెన్స్ లేని కారణంగా వదిలేశారు. దీంతో పార్క్ కళావిహీనంగా మారింది. రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈత కొలనును వదిలేయటం పట్ల పట్టణవాసులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. రెండు నెలల క్రితం మున్సిపల్ పాలకుల పర్యవేక్షణ కాలంలో ఈత కొలనుకు విపరీతంగా రద్దీ ఉండేది. కొత్తగూడెం, పాల్వంచ పట్టణ ప్రాంతాల నుంచి కూడా ఎంతోమంది ఇక్కడికి వచ్చేవారు. ఇక గంటకు రూ.100 ఫీజు ధర నిర్ణయించారు. ఒక్కరోజే సుమారు రూ.10 వేల ఫీజు రూపేణా వచ్చింది. ఈత కొలనులో ఇంత రద్దీ ఉంటున్న తరుణంలో ఓ చిన్న సంఘటన కారణంగా పడావు పడేయటం పలు విమర్శలకు తావిస్తోంది.

ఆందోళన చెందుతున్న విద్యార్థులు..

సెలవు రోజుల్లో ఇంటి వద్ద ఉండలేక, బయటకు వెళ్లి దురలవాట్లకు లోను కావద్దనుకునేవారు ఈత కొలనుకు వెళ్దామంటే అదీ లేక బోర్‌గా గడిపేస్తున్నారు. ఈత నేర్చుకుంటే వ్యాయామం కూడా అవుతుందని ఆశపడితే మూన్నాళ్ల ముచ్చట చేశారని మదనపడుతున్నారు. ప్రతీరోజు లేక్ వ్యూ పార్క్ వద్దకు వచ్చి చూసి వెళ్లేవారు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

నామమాత్రంగా రక్షణ చర్యలు ..

ఈత కొలను చుట్టూ రక్షణ చర్యలు సరిగా లేవు. పార్క్‌లో కొలను ఉన్నందున పార్క్‌కు వచ్చినవారు కొలను వైపు వచ్చే అవకాశం ఉంది. కొలను చుట్టూ రక్షణ లేదు. పెన్సింగ్ ఏర్పాటు కోసం టెండర్‌కు ఆహ్వానం పలికి నెలలు గడిచింది. ఇక మున్సిపల్ వర్కర్‌తోనైనా మెయింటెనెన్స్ చేసేలా కొలనును ప్రారంభించారు. కానీ వెంటనే మూలన పడింది.

పారిశుద్ధ్యం కరువు..

పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచే లేక్ వ్యూ పార్క్‌లో పారిశుద్ధ్యం కరువయింది. ఎక్కడి చెత్త అక్కడే ఉంది. అంతేకాకుండా పార్క్‌లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పట్టణ ప్రజలు పార్క్ నిర్వహణ పట్ల పెదవి విరుస్తున్నారు.

ఉపయోగంలోకి తేవాలి..



రెండు నెలలుగా ఈత కొలనులో నీటిని తీసేశారు. సెలవుల్లో ఈత నేర్చుకునే అవకాశం లేకుండా పోయింది. వ్యాయామం కోసం కూడా ఉపయోగపడుతుంది. తక్షణం అధికారులు ఈత కొలనును ఉపయోగంలోకి తీసుకురావాలి.

–ఏ.మిథున్, విద్యార్థి, ఇల్లెందు

అధికారులు స్పందించాలి..



పట్టణంలోని చెరువు కట్ట లేక్ వ్యూ పార్క్‌పై అధికారులు స్పందించాలి. పిల్లలు పార్క్‌లకు వచ్చేలా ఆహ్లాదం పంచే మొక్కలు పెంచాలి. పారిశుద్ధ్యన్ని మెరుగుపర్చి, పార్క్ ఉపయోగంలోకి వచ్చేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి.

– పందిళ్ల వెంకటేశ్వర్లు, ఇల్లెందు

చర్యలు తీసుకుంటాం..



ఇల్లెందు లేక్ వ్యూ పార్క్‌ను ఉపయోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాము. దానికి తగ్గట్టు కార్యాచరణ రూపొందిస్తున్నాం. పటిష్ట చర్యల కోసం ఆలస్యం జరుగుతోంది. త్వరలో పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం..

– సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



ఇల్లెందు: ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రధాన రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు



జూలూరుపాడు: సొసైటీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సుజాతనగర్: సొసైటీ గోడౌన్ వద్ద వేచి ఉన్న వివిధ గ్రామాల రైతులు

ఇల్లెందు: ఇల్లెందు చుట్టుపక్కల గ్రామాల రైతులు ఎరువుల కోసం తెల్లారుజామున నుంచే ఇల్లెందు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంల వద్దకు చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు ఎరువులు లేవని తీరిగ్గా సొసైటీ సిబ్బంది చెప్పడంతో రైతులు ఆగ్రహించారు. రైతులు మార్కెట్ యార్డు నుంచి నినాదాలు చేస్తూ ప్రభుత్వాస్పత్రి వద్ద మెయిన్ రోడ్డుకు చేరుకుని ధర్నా చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో నచ్చజెప్పారు. సమాచారం అందుకున్న ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని యూరియా కొరత నివారించేలా అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని మధు డిమాండ్ చేశారు.

ఏఓ కార్యాలయం ఎదుట..

రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ ఎన్డీ ఆధ్వర్యంలో గోవింద్ సెంటర్‌లోని ఏఓ కార్యాలయం ఎదుట ఎన్డీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి.నాగేశ్వరరావు, గౌని నాగేశ్వరరావు, మోతీలాల్, కె.సారంగపాణి, బి.శ్యామ్, ప్రణయ్, రైతులు పాల్గొన్నారు.

సుజాతనగర్: యూరియా సకాలంలో అందక మండలంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాఘవాపురం, నర్సింహసాగర్, సర్వారం గ్రామాల రైతులు గురువారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో యూరియా కోసం వచ్చారు. 10 రోజులుగా పనులు మానుకొని యూరియా కోసం వచ్చి వెనుదిరుగుతున్నామని, రేపు మాపు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

జూలూరుపాడు: తక్షణమే రైతులకు యూరియా కొరత తీర్చాలని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో గురువారం సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షానికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా లేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రమణారెడ్డి, పలమడుగు రామ్మూర్తి, లకావత్ హేమ్లా, భూక్యా సేవా, రైతులు పాల్గొన్నారు.